బీఎస్‌ఎల్పీ రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్‌ఎల్‌పీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌ఎల్‌పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 20లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

18 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం అయిదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 9703589689, 798990 3001 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

బీఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డీడీఎంఎస్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 63058958 67 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అందుబాటులోకి మాన్‌సూన్ బృందాలు

- వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

మాన్‌సూన్ బృందాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్

అబిడ్స్, జూన్ 13 : వర్షాకాలంలో వర్షం నీరు నిలిచి పోకుండా ఉండడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మాన్‌సూన్ బృందాలను రంగంలోకి దింపారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఐదు సర్కిల్‌లలో మాన్‌సూన్ బృందాలు పనిచేస్తాయి.

రూ.10.31 కోట్ల నిధులు విడుదల..

106 స్టాటిక్ టీంలు, 28 మొబైల్ టీంలు, 32 మాన్‌సూన్ వాహనాలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జీహెచ్‌ఎంసీ రూ.10.31 కోట్ల నిధులను విడుదల చేసింది. ఆయా నిధులతో మాన్‌సూన్ బృందాల నిర్వహణకు టెండర్లను ఖరారు చేశారు. ఓ జీపుతో పాటు అవసరమైన పరికరాలు, నలుగురు కార్మికులతో బృందాలు కొనసాగుతాయి. వర్షం కురిసి నీరు నిలిచి పోయినట్లు సమాచారం అందిన వెంటనే ఈ బృందాలు రంగంలోకి దిగి వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాయి. మ్యాన్‌హోల్‌లపై పేరుకు పోయిన చెత్తను తొలగించడంతో పాటు మ్యాన్‌హోల్‌పై కప్పులను తెరిచి నీరు పోయేంత వరకు పర్యవేక్షిస్తారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని గోషామహల్, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిల్‌ల పరిధిలోని అన్ని డివిజన్‌లకు మాన్‌సూన్ బృందాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వర్షం కురిసినప్పుడల్లా మొజాంజాహి మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్, తోపఖానా, రంగ్‌మహల్ చౌరస్తా, పోలీస్ కంట్రోల్‌రూం తదితర ప్రాంతాలలో వర్షం నీరు నిలిచి పోయేది. ఈ సంవత్సరం ఆ పరిస్థితి ఉత్పన్నం కాకుండా అధికారులు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాలలో స్టాటిక్ టీంలను రంగంలోకి దింపేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతే కాకుండా వృక్షాలు కూలితే తొలగించేందుకు సెంట్రల్ ఎమర్జెన్సీ స్క్వాడ్‌తో పాటు మాన్‌సూన్ బృందాలు పని చేస్తాయి. అంతే కాకుండా వర్షం నీటిని తోడి వేస్తారు.

బృందాలు ప్రారంభం..

జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన మాన్‌సూన్ బృందాలను జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాలాలలో పూడికతీత పనులను చేపట్టడం జరిగింది. అదే విధంగా మాన్‌సూన్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచాం. ఖైరతాబాద్ జోన్‌లో రూ.10.31 కోట్ల వ్యయంతో మాన్‌సూన్ బృందాలను ఏర్పాటు చేశాం.

– సహదేవ్ రత్నాకర్, ఎస్ఈ

నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- ఈ ఘటనలో ఇద్దరి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- మానవత్వ కోణంలో ముందుకు వెళ్లిన యువకుడు మృతి

అజయ్(ఫైల్)

సుల్తాన్‌బజార్, జూన్ 13. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడిపిన వ్యక్తి, ఒకరి మృతికి, మరో వ్యక్తి తీవ్ర గాయాలకు కారణమయ్యాడు. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నాంపల్లి పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన ప్రకారం .. కూకట్‌పల్లి రామాయణ్ టెంపుల్ సమీపంలోని విష్ణు సాయి బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గిద్దలూరు చెందిన చిమలదిన్నె రామాంజనేయులు(24) తన స్నేహితుడైన రాజశేఖర్ జన్మదినం సందర్భంగా తోటి హాస్టల్ స్నేహితులు మధు, శ్రీకాంత్‌లతో కలిసి మహేంద్ర క్వెకార్ నం. (టీఎస్ 07 యూజీ 3650)లో చార్మినార్ వద్ద పుట్టిన రోజు వేడుకలు జరుపుకనేందుకు వెళ్లారు. ముందుగానే కార్‌లో అందుబాటులో ఉంచిన 8 బీర్ బాటిళ్లను సేవించారు. తద నంతరం రాత్రి 12 గంటల ప్రాంతంలో చార్మినార్ వద్దకు చేరుకొని అక్కడ రాజశేఖర్ కేట్‌కట్ చేసి బర్త్ డే వేడుకలను జరుపుకున్నారు. అనంతరం హాస్టల్‌కు తిరుగు ప్రయాణంలో మద్యం సేవించిన కారు డ్రైవర్ మితి మీరిన వేగంతో నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఒక ఆటోను ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టింది. ఆ కారును ఆపేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా వేగంతో ఉన్న కారు ఆ వ్యక్తిని ఢీకొట్టి పై నుంచి వెళ్లింది. దీంతో ఆ వ్యక్తిని తోటి స్నేహితులు నిమ్స్ దవాఖానకు తరలించారు. వైద్య చికిత్స పొందుతున్న నేరెడ్‌మెట్‌కు చెందిన అజయ్ మృతి చెందాడు. ఈ ఘటనలో హఫీజ్‌పేటకు చెందిన ఆటోడ్రైవర్ నర్సింగ్‌రావు(55) తీవ్ర గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

కారును ఆపేందుకు వెళ్లిన వ్యక్తి మృత్యువాత..

ఆటోను ఢీ కొట్టి వెళ్తున్న కారును ఆపేందుకు వెళ్లిన నేరెడ్‌మెట్‌కు చెందిన అజయ్ మృత్యువాత పడటం అందరినీ కలిచివేసింది. కాగా అజయ్ తన తోటి స్నేహితులు పొన్నాడ సాయితేజ్, సమిల్లాఖాన్, జి సుజిత్‌లతో కలిసి నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద హోటల్‌లో బిర్యాని తినేందుకు వచ్చారు. బిర్యాని తిన్న అనంతరం బయటికి వచ్చిన స్నేహితులకు ఆటో బోల్తా పడటం చూసి ఢీకొట్టిన కారును ఆపేందుకు యత్నించాడు. ఈ క్రమంలో కారు ఢీ కొట్టి పై నుంచి వెళ్లడంతో నిమ్స్ లో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన అజయ్ స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనకు కారణమైన నలుగురిలో ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

పేరిణి నాట్యం గొప్ప ప్రాచీన నృత్య కళ

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

రవీంద్రభారతి, జూన్ 13 : అంతరించిపోతున్న ప్రాచీన కళలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, నాట్యగురువులపై ఉందని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, పేరిణి సప్తతాండవాలు నృత్యప్రదర్శన పీఆర్‌కే నాట్య ప్రపంచం ఆధ్వర్యంలో పేరిణి నృత్య తాండవాలు, నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కృష్ణారావు విచ్చేసి నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో బాద్మీ శివకుమార్, సంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీకి వినతిపత్రం



తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహమత్‌అలీ, అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యాకులు మధులు షబ్బీర్‌ను కలిసిన అనంతరం మాట్లాడుతూ.. వాణిజ్య పన్నుల శాఖలో గత సంవత్సరం నుంచి హైర్‌కార్స్ పేమెంట్, స్వీపర్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయించాలని కోరారు. స్పందించిన షబ్బీర్‌అలీ బకాయిల విడుదల గురించి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి విడుదల చేసే విధంగా ప్రయత్నిస్తానని హామీనిచ్చారని తెలిపారు. –అబిడ్స్, జూన్ 13

బ్లాక్‌మార్కెట్‌కు రేషన్ బియ్యం

9 మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యాన్ని నల్లబజార్‌కు తరలిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, 46 క్వింటాళ్ల బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిపెరుమాల్ కథనం ప్రకారం... లబ్ధిదారులు తీసుకునే సబ్సిడీ బియ్యాన్ని తక్కువ ధరకు కొందరు కొని వాటిని ఎక్కువ ధరకు నల్లబజార్‌కు తరలించే ముఠాలకు విక్రయిస్తుతానరు. హుమాయిన్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట్, యాఖత్‌పురా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇలా జరుగుతుందని సమాచారం రావడంతో రైస్ బ్లాక్‌మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెట్టి 9 మందిని అరెస్ట్ చేశారు. నిందితులు అత్తాపూర్‌కు చెందిన విశాల్ యాదవ్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నజీర్, వారసిగూడకు చెందిన మహ్మద్ షోహెబ్, మహ్మద్ జంగీర్, ఎండీ షాహబాజ్, సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు, పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీమ్, అంబర్‌పేట్‌కు చెందిన సయ్యద్ నజీమ్, మహ్మద్ మజహర్‌లను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 2.5 లక్షల విలువైన బియ్యం, గోధుమలతో పాటు ఒక బైక్, లారీని స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరి వ్యక్తుల గొడవలో.. వ్యక్తి హత్య

నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రాత్రి జరిగింది

సుల్తాన్‌బజార్, జూన్ 13 : ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన గురువారం నాంపల్లి పోలీ స్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన ప్రకారం.. బుధవారం రాత్రి నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గొడవపడి ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గొడవలో ఓ వ్యక్తి ఛాతిపై మరో వ్యక్తి ఇటుక రాయితో బలంగా దాడి చేయడంతో తీవ్ర ఆయాలపాలై అక్కడే కుప్పకూలాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నాంపల్లి పోలీసులు వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని గుర్తించారు. కాగా గొవడ పడిన వ్యక్తులను స్థానికులు ఎవరూ గుర్తించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు.మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉండవ చ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా సీసీ ఫుటేజీ ఆధారంగా గొడవపడి వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గృహాలను నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలి

రవీంద్రభారతి, జూన్13 : ఈసీఐఎల్ సమీపంలో చట్ట ప్రకారం కొనుగోలు చేసిన స్థలాల్లో గృహాలు నిర్మించుకునేందుకు జీహెచ్‌ఎంసీ అనుమతి ఇవ్వాలని , అలాగే రీసేల్ చేసుకునేందుకు సబ్-రిజిస్ట్రార్ అవకాశం కల్పించాలని శ్రీసాయి కృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం, ప్రజావాణిలో మేడ్చల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు అసోసియేన్ నాయకులు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేవంలో అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, సభ్యులు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 177లో 13 ఎకరాల 20 గుంటల భూమిని పట్టాదారుల నుంచి 15 ఏండ్ల క్రితం కొన్నట్లు తెలిపారు. ఇందులో 220 ప్లాట్లు ఉన్నాయని సగం మంది గృహాలు నిర్మించుకున్నారని, కాగా మిగిలిన వారు గృహాలు నిర్మించుకునేందుకు జీహెచ్‌ఎంసీ అనుమతి కోరినట్లు తెలిపారు. పాత పట్టాదారులలో ఒకరిద్దరు అధికారులను, ప్లాట్ యజమానులను బెదిరిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

16న ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ

సుల్తాన్‌బజార్, జూన్ 13: ఈ నెల 16న కింగ్‌కోఠి ఈడెన్ గార్డెన్‌లో నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్‌ను, కాంగ్రెస్ నాయకులు అరవింద్‌యాదవ్‌లకు గురువారం ఆహ్వానపత్రాన్ని సంస్థాన్ ప్రతినిధులు రిథేశ్ జాగిర్ధార్, రమేశ్‌కుమార్ బంగ్, దేవేంద్రచౌబిసార్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 684 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

బీర్ల ఐలయ్యకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వాలి

రవీంద్రభారతి, జూన్ 13 : బీర్ల ఐలయ్యను రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ కురుమ రాజకీయ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నేత జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. కురుమ కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, గొరిగే మల్లేశ్ , రఘునాత్, కొంగల పాండు, పర్వతాలు, శ్రీనివాస్, మాధారం కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్లను అందజేస్తున్న సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి,ఎస్సైలు, సుభాష్, రవికుమార్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నాం: కాచిగూడ సీఐ

కాచిగూడ,జూన్ 13: అన్ని వర్గాల సహకారంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఈస్ట్‌జోన్ డీసీపీ ఆదేశాల మేరకు సీఎస్ఐఆర్ యాప్ ద్వారా 17 ఫోన్లను గుర్తించి, రికవరీ చేసి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ 100 డయల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్, ఎస్సైలు, హెచ్. నరేశ్, పి.రవికుమార్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలి

సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ నాంపల్లి తాసీల్దార్ ప్రేమ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, ప్రభుత్వ స్థలాల కబ్జా అంశాలను తాసీల్దార్ దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటు పడ్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మహ్మద్ అహ్మద్ బాబ, షర్ఫుద్దీన్, సయ్యద్ యూసుఫ్, షేక్ జలీల్, ఖాజా, మహ్మద్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్, జూన్ 13

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి, పారిశుధ్య విభాగం, ఎంటమాలజీ వి భాగాల అధికారులు ఏర్పాట్లు చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ సెవన్‌టూంబ్స్‌తో పాటు ఈద్గా మైదానాలను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్, వక్ఫ్‌బోర్డు అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. బక్రీద్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

– మెహిదీపట్నం, జూన్ 13

ఆమనికి డాక్టరేట్ ప్రదానం

సామాజిక సేవా రంగాలలో ఆమని ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆమని ములుగు చేస్తున్న సేవలకు గాను హోలిస్పిరిట్ క్రిస్టియన్ విశ్వవిద్యాలయం(హెచ్ఎస్సీ) డాక్టరేట్‌ను ప్రకటించి గురువారం జరిగిన కార్యక్రమంలో బిషప్ ఆనంద్, డాక్టర్ అబ్రహం, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కుసుమ భోగరాజు పాల్గొని అందజేశారు.

– తెలుగు యూనివర్సిటీ

జాతీయ క్రీడా కోడ్ అమల్లోకి తీసుకురావాలి

రవీంద్రభారతి, జూన్13 : రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ టోర్నమెంట్ జరిగినా సంబంధిత క్రీడల్లో గుర్తింపు కలిగిన రాష్ట్ర , జిల్లా క్రీడా సంఘాల అనుమతితోనే జరిగాయని గుర్తు చేశారు. డబ్బులు దండుకోవడానికి తీరుకొక టోర్నమెంట్ పెడుతూ క్రీడాకారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్ రాష్ట్రీయ క్రీడా పోటీల పేరుతో కొంత మంది లక్షల్లో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. క్రీడలపై అవగాహన లేని తల్లిదండ్రులు అప్పులు చేసి బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్‌ని పక్షాళనం చేసి సరైన రథ సారథులతో క్రీడా సంఘాలు ఏర్పడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కనపర్తి రమేశ్, లక్ష్మణ్, తిరుమలరెడ్డి, విజయ్‌కుమార్, సురేందర్, సంజయ్‌కుమార్, సి. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

సుల్తాన్‌బజార్, జూన్ 13. ఆయుష్ విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ అన్నారు. గురువారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని జిల్లా శాఖ కార్యా లయంలో ఆయనను టీఎన్జీవో ఆయుష్ యూనిట్ అధ్యక్షుడు టి. నర్సింహాచారి, కార్యదర్శి ఎస్. లక్ష్మణ్ కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. జీవో 317 ప్రకారం అన్యాయంగా కలిపిన నిజామియా జనరల్ హాస్పిటల్, టీబీ కాలేజీలను తొలగించాలని కోరారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్. విక్రమ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, ఆయుష్ విభాగం యూనిట్ ఉపాధ్య క్షులు కాజం మోయినుద్దీన్, సతీశ్‌కుమార్, భాను శ్రీనివాస్, విశాల్, వెంకటరమణ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించేలా చూడాలి

అబిడ్స్ , జూన్ 13 : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్